

ఆగుతూ.. ఊగుతూ..


ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వెంకట సత్య నారాయణస్వామి దేవస్థానంలో శానిటరీ మెటీరియల్‌తో సహ క్లీనింగ్, హౌస్ కీపింగ్, పారిశుధ్య పనులు రీ టెండర్ ఖరారు మరింత ఆలస్యం కానుంది. -8లో



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలోని నిత్యాన్నదానం ట్రస్టుకు రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటగిరికి చెందిన కొంపెల్ల అలివేలు, వారి కుటుంబ సభ్యులు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు.

1.62 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 1,62,092 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద బుధవారం 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 14,600 క్యూసెక్కులు వదిలారు. మొత్తం 175 గేట్లను పైకి లేపి మిగులు జలాలను విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

డిసెంబర్ నాటికి టిడ్కో ఇళ్ల పంపిణీ

కాకినాడ సిటీ: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న 365/430 కేటగిరీ టిడ్కో గృహాలన్నింటినీ వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరి నారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత కలెక్టర్ షణ్మోహన్ గత సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలను కమిటీకి వివరించారు. జిల్లాలో జీరో పావర్టీ, పీ–4 కార్యక్రమ అమలు ప్రగతిని వివరించారు. రూరల్ నియోజకవర్గం పరిధిలో 11 ఏళ్లగా ఎన్నికలు జరగని ఏడు గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక, సాధారణ నిర్వహణ కష్టమవుతోందని, ఈ పంచాయతీలను కాకినాడ నగరంలో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. సమావేశంలో ఒన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ స్కీమ్ కింద పెద్దాపురం సిల్క్ చీర ఉత్పత్తులు ఎంపికై నందుకు అధికారులను, నేతన్నలను మంత్రి అభినందించారు. సమావేశంలో జేసీ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు



కత్తిపూడిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువుల దుకాణాలపై బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో భాగంగా స్థానిక భక్తాంజనేయ ఫెర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా రూ.2,49,200 విలువైన వరి విత్తనాలు, రూ.2,05,347 విలువైన ఎరువుల విక్రయాలు నిలిపివేశారు. గొడౌన్‌లో ఉన్న స్టాకు రిజిస్టరులో స్టాకుకు వ్యత్యాసం, రికార్డులు సక్రమంగా లేకపోవటంతో వాటిని నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ సంచాలకుడు షంషీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ పి.శివరామకృష్ణ, ఏఓ పి.గాంధీ, ఏఈఓ ఆర్.మౌళిప్రసాద్ పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర భారత్ యోగాసన క్రీడా సంఘం, కోకనాడ యోగాసన క్రీడా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం స్థానిక జేఎన్‌టీయూ యోగా హాల్‌లో జిల్లా యోగాసన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సానా సతీష్ బాబు, అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ సుధాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల నిండిన వారి నుంచి 14 ఏళ్ల వారి వరకు, 14 నుంచి 18 వరకు, 18 నుంచి 28 వరకు, 28 నుంచి 35 వరకు, 35 నుంచి 45 వరకు, 45 నుంచి 55 ఏళ్లవారి వరకు వివిధ కేటగిరీలలో యోగాసన పోటీలు జరుగుతాయని వారు తెలిపారు. ఆరు విభాగాల్లో బాలురు, బాలికలు పాల్గొనవచ్చునని ప్రపంచ యోగాసన, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ వారు ఇచ్చిన సిలబస్ ప్రకారం ట్రెడిషనల్ యోగ, రిథమిక్ యోగ, ఆర్టిస్ట్ యోగ, 10 రకాల పోటీలు జరగనున్నాయన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు 91334 33491 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం సిటీ): రాజమహేంద్రవరంలోని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, ఫిజిక్స్, ఇంగ్లిష్, తెలుగు, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ , కామర్స్‌లో ఖాళీలున్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 19 తేదీ లోపు కళాశాల ఆఫీసుకు అందజేయాలన్నారు. ఇంటర్వ్యూలు ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ అసలు సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు వెంట తీసుకుని రావాలన్నారు. వివరాలకు 9398677385, 9866131354 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నీరుత్సాహంగా ఖరీఫ్

- లెక్క తప్పిన అధికారులు
- నీరందక అన్నదాత లబోదిబో
- వరదలకు చిక్కుకోకూడదంటూ మొదట్లోనే ముంచేసిన వైనం
- జూలై 16 నాటికి జిల్లాలో కనీసం 10 శాతం నాట్లు కూడా పడని వైనం
- రైతుల గోడు పట్టని మంత్రులు
- దిక్కులు చూస్తున్న అన్నదాతలు



పిఠాపురం మండలం రాయవరంలో నీరులేక, నాట్లు పడక బీడువారిన పంట భూమి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ముందస్తు సాగుపై ప్రభుత్వం లెక్క తప్పింది. అప్పుడేమో అంతన్నారింతన్నారు.. తీరా అదును దాటిపోతున్నా పాలకులు కన్నెత్తి చూడటం లేదు. ప్రకృతి విపత్తులకు దొరక్కుండా పంట చేతికి రావాలంటే ముందస్తు సాగుకు రైతులు సమాయత్తం కావాలంటూ కూటమి సర్కార్ ఊరూవాడా ఊదరగొట్టి చివరకు చేతులెత్తేసింది. కనీసం సమయానుకూలంగా సాగునీరు అందించలేక రైతులను 'అడకత్తెరలో పోకచెక్క'ను చేసేసింది. జూన్ ఒకటి నుంచి కాలువలకు నీరు విడుదల, జూన్ 15 కల్లా నారుమళ్లు పూర్తిచేసి అదే నెల చివరికి నాట్లు ముగించాలి. అటు గోదావరి, ఇటు ప్రాజెక్టుల నుంచి సాగునీరు విడుదలకు ఇబ్బంది ఉండదని కూటమి పెద్దలు ఘనమైన ప్రకటనలు చేశారు. జిల్లా రైతులు వారి మాటలు నమ్మి తొలకరి సాగుకు సమాయత్తమయ్యారు. తీరా చూస్తే అనుకున్నట్టుగా కాలువలు, ప్రాజెక్టుల నుంచి నీరు రాక ఖరీఫ్ ప్రశ్నార్థకమై రైతులు లబోదిబోమంటున్నారు. అప్పుడే జూలై 16వ తేదీ వచ్చేసింది. కానీ జిల్లాలోని గోదావరి కాలువ కింద, మెట్ట ప్రాంతంలో ప్రాజెక్టుల కింద ఆయకట్టులో కనీసం 10 శాతం నారుమళ్లు కూడా వేయలేకపోయారు. కేవలం బోర్లపై ఆధారపడ్డ రైతులు మాత్రమే అక్కడక్కడా నారుమళ్లు పోసుకుని సాగునీటి కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 2024–25 ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 94,594 హెక్టార్లు. ఖరీఫ్ అదును దాటిపోతున్నా ఇంతవరకు కేవలం 12 వేల హెక్టార్లలో మాత్రమే నాట్లు పడ్డాయి. కొన్ని మండలాల్లో సెంటు భూమిలో కూడా నాట్లు పడలేదు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణంలో కనీసం 10 శాతం సాగు కూడా ముందుకు సాగని విషయాన్ని అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

ఈస్టర్న్ డెల్టాలో ఇప్పుడిప్పుడే..

జిల్లాలో ఈస్టర్న్ డెల్టాతో పాటు గోదావరి కాలువ ద్వారా సాగయ్యే సామర్లకోట, కరప మండలాల్లో సాగునీరు ఇప్పుడిప్పుడే వస్తోంది. పంపా, తాండవ, ఏలేరు, పుష్కర ప్రాజెక్టుల నుంచి ఇప్పటి వరకు నీరు విడుదల కాలేదు. ఏలేరు నుంచి సాగుకు ఇప్పుడు వదిలినా అది చేలలోకి ఎప్పుడు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి. సాధారణంగా జూన్ ఒకటో తేదీ నుంచి నారుమళ్లు వేసి జూన్ నెలాఖరుకు నాట్లు పూర్తవ్వాల్సి ఉంది. ఇదే విషయాన్ని అధికారులు ప్రచారం చేశారు. ఈ సమయంలో నారు వేసి నాట్లు వేస్తేనే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వచ్చే ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా ఉంటుందని అధికారులు చెబుతూ వచ్చారు. జూలై 16వ తేదీ వచ్చినా జిల్లాలో 10 శాతం నాట్లు కూడా పడలేదు. ఈ క్రమంలో నారు వేసే పనులు ఈ నెలాఖరుకు గాని పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సాగు 45 రోజులు ఆలస్యం కాగా మరింత జాప్యం జరిగితే ఆశలు వదిలేసుకోవాల్సిందేనంటున్నారు. వాస్తవానికి జూన్ నాటికి ఏలేరు జలాలు విడుదల చేయాల్సి వుంది. జూలై మొదటి వారం అయినా సాగునీరు విడుదల కాలేదు.

ఏలేరు నుంచి విడుదల చేశామంటున్నా..

ఏలేరు ప్రాజెక్టు నుంచి 1600 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏలేరు రిజర్వాయర్. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని జగ్గంపేట, ఏలేశ్వరం, కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు సామర్లకోట, కాకినాడ రూరల్ మండలాల పరిధిలో సుమారు 56 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు నుంచి 150 క్యూసెక్కులు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పోను 50 క్యూసెక్కులు తిమ్మరాజు చెరువుకు, మిగిలిన 1400 క్యూసెక్కులు నాలుగు నియోజకవర్గాలు దాటి పిఠాపురం రావాల్సి ఉంది. ఈ నియోజకవర్గంలో సాగుచేస్తున్న 16,943 హెక్టార్లకు సుమారు 159 హెక్టార్లలో వరి నారుమళ్లు అవసరం. కానీ ఇప్పటి వరకూ ఎక్కడా 10 శాతం మించి నారుపోసిన దాఖలాలు లేవు. కాగా, జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 25 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. మెట్టలో రైతులు ఎక్కువగా చెరువులు, బోర్లపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు నీటితో నిండటంతో రైతులు ఖరీఫ్ పనులు ముమ్మరంగా చేపట్టారు. గోకవరం మండలంలో ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా సుమారు పది వేల హెక్టార్లు సాగవుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువ పరిధిలో సుమారు పది వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో నీరందక ఖరీఫ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది జూలై నెలలో 60 శాతం ఊడ్పులు పూర్తి కాగా, ఈ సీజన్‌లో 20 శాతానికి మించి కాలేదు. పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 27 వేల ఎకరాలకు సాగు నీరందాలి. ఈ సీజన్‌లో ఇప్పటికీ సాగునీరు విడుదల కాలేదు. సిమెంటు పైపుల స్థానంలో నూతనంగా ఐరన్ పైపులు నిర్మించడంతో పాటు ఇతర మరమ్మతులకు రూ.55 కోట్లకు ప్రతిపాదించగా ప్రభుత్వం మొండిచేయి చూపించడంతో పుష్కర నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. బొర్రంపాలెం ఎత్తిపోతల పథకంలో ఆయకట్టుకు కూడా చుక్కనీరు విడుదల కాక రైతులు లబోదిబోమంటున్నారు.

సక్రమంగా అందని గోదారి నీరు

కాకినాడ రూరల్‌లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4200 ఎకరాలలో వరి సాగు చేస్తుంటారు. చీడిగ, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి, తూరంగి గ్రామాల ఆయకట్టుకు గోదావరి జలాలు, తిమ్మాపురం, సర్పవరం, పండూరు, పి.తిమ్మాపురం, నేమాం, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాల ఆయకట్టుకు ఏలేరు ఆధారంగా సాగవుతుంది. గోదావరి జలాలు విడుదల చేసినా సక్రమంగా అందడం లేదు. ఏలేరు నుంచి ఆలస్యంగా ఈనెల 7న నీరు విడుదల చేయగా కాకినాడ రూరల్ మండలంలోని ఆయకట్టు శివారుగా ఉండడంతో ఇప్పటికీ సాగునీరు సక్రమంగా అందడం లేదు. తిమ్మాపురం, పండూరు తదితర గ్రామాలలో నారుమళ్లు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వర్షాలు లేక వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టేందుకు ఎదురు చూస్తున్న రైతులు నిరాశగా ఉన్నారు.

తూతూ మంత్రంగా క్లోజర్ పనులు

జిల్లాలో క్లోజర్ పనులు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో మొదలు పెట్టడంతో తూతూ మంత్రంగా చేసేసి అయ్యిందనిపించడానికేనని రైతు సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. క్లోజర్ పనులు జరుతున్నందున జూన్ నెలాఖరు నాటికి నీరు విడుదల చేస్తామని అధికారుల ప్రకటనలు గాలిలో కలిసిపోయాయి. ఖరీఫ్ దమ్ములు జరగాలంటే పూర్తి స్థాయిలో ఏలేరు రావల్సిందేనని రైతులు చెబుతున్నారు. పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో వరి పొలాల పరిస్థితి ఒకే విధంగా వుంది. ముందస్తు ఖరీఫ్ సాగు చేపడితే వరదల నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని బావించినా ప్రస్తుతం ఆలస్యం కావడంతో ఈ ఏడాది పంటలకు ముప్పు తప్పదంటున్నారు. ఏలేరు ఆయకట్టుకు అక్టోబర్ నెలలో వరద బెడద అధికం. మూడేళ్లగా రైతులు వరదలతో నష్టపోతూనే వున్నారు. పంటల రక్షణకు జూన్‌లో వరి సాగు ప్రారంభించి నవంబరు, డిసెంబరు నాటికి వరికోతలు పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేక సాగునీటి జాప్యంతో జిల్లాలో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లేదా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ప్రజాప్రతినిధులు ఎవరికీ తమ గోడు పట్టడం లేదని రైతులు ఆగ్రహంవ్యక్తంచేస్తున్నారు.

2024-25 ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం, నాట్లు వేసిన ఆయకట్టు వివరాలు (హెక్టార్లలో)

మండలం	విస్తీర్ణం	నాట్లు
కోటనందూరు	4110	0
తుని	3276	265
రౌతులపూడి	2446	220
శంఖవరం	1253	11
ఏలేశ్వరం	2669	0
జగ్గంపేట	4086	77
కిర్లంపూడి	5144	100
ప్రత్తిపాడు	4540	120
తొండంగి	5274	39
గొల్లప్రోలు	5372	816
పెద్దాపురం	4537	313
గండేపల్లి	3908	967
సామర్లకోట	9215	2738
పిఠాపురం	8000	38.71
యు.కొత్తపల్లి	4486	26
కాకినాడ రూరల్	1780	80
కాకినాడ అర్బన్	167	14
పెదపూడి	7361	760
కరప	5868	2060
కాజులూరు	7570	2758
తాళ్లరేవు	3532	606
మొత్తం	94594	12008.71



అడుగంటిన రాయవరం చెరువు

నారుమళ్లు ఎండిపోతున్నాయి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే సాగుకు సిద్ధం కావాలని అధికారులు చెప్పారు. వారి మాటలతో ఈ సారి ముందస్తు సాగు చేసేద్దామని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ దుక్కులు దున్నుకోవడానికి సరైన వర్షాలు కూడా పడలేదు. వేలాది రూపాయలు వెచ్చించి వేసిన నారుమళ్లు ఎండిపోతున్నాయి. సాగునీరు ఎప్పుడు విడుదల చేసినా ముందుగానే నారుమళ్లు వేసుకునే వాళ్లం. కానీ ఈ సారి నారుమళ్లకు నీటి విడుదల లేకపోవడం, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయే వాతావరణం కనిపిస్తోంది.

– గంటా కొండబాబు, కాకరాపల్లి, కోటనందూరు మండలం

నీరు లేక సాగని పనులు



గతంలో ఎన్నడూ ఇలా లేదు. సాగునీరు అందకపోవడంతో ఖరీఫ్‌లో నారుమడులు కూడా వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కనీసం ఇంజిన్లతో నీరు తోడుకుందామంటే నీరు అందడంలేదు. నీళ్ల వదిలామని అధికారులు చెబుతున్నప్పటికీ కాలువల్లో నీరు కనిపించడం లేదు. నారుమడులకు నీటి ఎద్దడి ఇలా ఉంటే, రేపు నాట్లు పడితే ఎలా ఉంటుందో తెలియడంలేదు.

– లోకారెడ్డి అప్పన్నదొర, చేబ్రోలు శివారు లక్ష్మీపురం, గొల్లప్రోలు మండలం

వాడపల్లి క్షేత్రంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు పెంచేందుకు చర్యలు తీసుకున్నట్టు డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్యూలైన్లు పెంచడంతో పాటు ప్రవేశ ద్వారాల వద్ద వెడల్పాటి మార్గాలను ఏర్పాటు చేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న లడ్డూ కౌంటర్లకు అదనంగా మరికొన్ని కౌంటర్లు పెంచనున్నామన్నారు. వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచనున్నామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను తహశీల్దార్ రాజేశ్వరరావు, డీసీ చక్రధరరావు బుధవారం పరిశీలించారు.

అన్న ప్రసాద భవనానికి రూ.50 వేల విరాళం

వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా ఆకివీడుకు చెందిన కొల్లి వెంకటేశ్వరబాబు, వెంకటలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. దాతలకు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందించారు.



వాడపల్లి క్షేత్రంలో దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

దరఖాస్తుల ఆహ్వానం

వాడపల్లి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ప్రతి శనివారం దేవస్థానం ద్వారా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఈ శిబిరంలో సేవ చేయడానికి నర్సింగ్ క్వాలిఫైడ్ అయిన మహిళలు / పురుషుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మోదీ విధానాలతో దేశానికి ప్రమాదం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్

సామర్లకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. స్థానిక నీలమ్మచెరువు వద్ద జరిగిన సీపీఐ జిల్లా మహాసభకు ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గాంధీచౌక్‌లో జరిగిన సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు తీర్మానాలు చేశారు. ప్రధాని మోది మతోన్మాద విధానాలతో దేశం ప్రమాద స్థితిలో ఉన్నదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఏటా లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిందని ప్రభాకర్ అన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారా అనేక ప్రజా సమస్యలను పరిష్కరించిందన్నారు. పారిశ్రామిక వేత్తకు రూ.15లక్షల కోట్లు రుణ మాఫీ చేసిన కేంద్రప్రభుత్వం కౌలు రైతులకు రూ.రెండు లక్షల చొప్పున రుణమాఫీ చేయడానికి ముందుకు రావడం లేదని ఆయన ధ్వజమెత్తారు. కాకినాడ నుంచి అమలాపురం వరకు ఉన్న గ్యాస్ నిక్షేపాలను పైపులైన్ ద్వారా మహారాష్ట్ర, గుజరాత్‌లకు తరలిస్తున్నారని, స్థానికంగా లభించే గ్యాస్, పెట్రోలు నిక్షేపాలను స్థానికంగా అందజేస్తే గ్యాస్ సిలిండర్ రూ.100కే వస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి నాయకుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేసే పది వేల కుటుంబాలను రోడ్డున పడేశారన్నారు. వలంటీర్ల పొట్ట కొట్టిన ఘనత చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. వలంటీరులకు రూ.10వేలు ఇస్తామని రెండున్నర లక్షల మందిని నమ్మించి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలకు ముడుపులు చెల్లిస్తే కానీ మద్యం పాటలు జరుపుకోవడానికి వీలు లేదని హుకుం జారీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తూ ఉన్నా అడిగే దమ్ము అధికారంలో ఉన్న వారికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని అన్నారు. చంద్రబాబు నాయుడు 21 పర్యాయాలు ఢిల్లీ వెళ్తే 21 పైసలు కూడా ఇవ్వలేదన్నారు. అమరావతికి ఒకసారి శంకుస్థాపన చేసి రెండో పర్యాయం శంకుస్థాపన చేయడం విడ్డూరంగా లేదా అన్నారు. మోది రాష్ట్రం వచ్చిన సమయంలో రూ.700 కోట్లు ఖర్చు అయిందన్నారు. పవన్ కల్యాణ్‌కు చాక్లెట్ ఇచ్చి చాక్లెట్ బాయ్ అన్నట్లుగా చేశారన్నారు. సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యురాలు పి.దుర్గా భవాని, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో సాగుతున్న సీపీఐ ర్యాలీ

ఖాతాకు ప్రాణం పోస్తేనే కాసులు

- నిరర్థక ఖాతాలు ఎన్నున్నా నిరుపయోగమే
- జిల్లాలో నిర్జీవంగా ఉన్న ఖాతాలు 1,76,500
- అవి పునరుద్ధరిస్తేనే ప్రభుత్వ పథకాలు
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన పోస్టల్ శాఖ



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆధునిక కాలంలో రూపాయి నుంచి ఎంత పెద్ద మొత్తమైనా డిజిటల్ లావాదేవీలే సాగుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రతి రూపాయి లబ్ధిదారు ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఏదైనా తేడా జరిగినా తప్పు ఎక్కడ జరిగిందనేది సులభంగా తెలుసుకునే వీలుంటుంది. ఉదాహరణకు తల్లికి వందనం వంటి పథకాలు చాలా మందికి చేరలేదు. వీటిలో ఖాతా వినియోగంలో లేదంటూ సగటున ప్రతి సచివాలయానికి వంద నుంచి 150 వరకూ ఫిర్యాదులు వచ్చాయి. ఈ–కేవైసీ లేకపోవడం వల్ల జిల్లాలో దాదాపు రూ.2 కోట్లకు పైగా లబ్ధిదారుల ఖాతాకు చేరలేదు. దీంతో వారంతా సచివాలయాల చుట్టు ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు. ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేకపోవడంతో ఖాతాలు యాక్టివ్‌గా లేవని నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నివేదికలో ఉంది. గత ఏడాది నవంబర్‌లో 2,74,488 ఖాతాలు యాక్టివ్‌గా లేవని సచివాలయాల వారీగా విభజించి ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల ఖాతాలను ప్రదర్శించారు. దీంతో పోస్టల్, బ్యాంకింగ్ రంగాలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టగా దాదాపు లక్ష ఖాతాల వరకూ మాత్రమే యాక్టివేట్ చేసుకున్నారు. దీని ప్రకారం ఖాతాదారులందరూ వెళ్లి ఈకేవైసీ పూర్తి చేసుకునేలా ఆయా సచివాలయాల పరిధిలో సిబ్బంది ప్రోత్సహించాల్సి ఉంది. ఖాతాలు లేకపోతే జాతీయ బ్యాంకుల్లోగాని, తపాలా కార్యాలయాల్లో కానీ పొదుపు ఖాతాలు తెరవాల్సి ఉంది. అనంతరం సచివాలయ సిబ్బందికి ఇచ్చిన యాప్‌లో ఆయా ఖాతాలను ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం అప్‌డేట్ చేస్తారు.

ఖాతాలు బతికించాలి

ప్రభుత్వం నుంచి మంజురయ్యే ఏ సంక్షేమ పథకమైన లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంక్ ఖాతా బతికి ఉండాలి. కొందరికి రెండుమూడు ఖాతాలు ఉండి వాటిలో వినియోగంలో లేకపోవడం సమస్యలకు దారి తీస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని గుర్తించి అర్హులకు సంక్షేమ పథకాలు చేరవేయడానికి ప్రతి బ్యాంక్ ఖాతాను లైవ్‌లో ఉంచాలని భావిస్తోంది. వీలైనంత డిజిటల్ లావాదేవీలు జరిగేలా ప్రోత్సహించింది. దీంతో ప్రతిపైసాకు లెక్క ఉంటుందనే ప్రధాన ఉద్దేశం. అలా జరిగినప్పుడే 18 ఏళ్లు నిండిన లబ్ధిదారుల ఖాతాలకు నవశకం బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ పోర్టల్లో ప్రభుత్వం విడుదలచేసే సంక్షేమ నిధులు కచ్చితంగా అందుతాయనే భావనతో ప్రభుత్వం ఉంది.

తపాలా శాఖ ప్రత్యేక డ్రైవ్

నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని నేపథ్యంలో పోస్టల్ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కేవలం రూ.200 తో గ్రామ స్థాయిలో వారి ఇంటి వద్దే ఖాతా ప్రారంభిస్తుంది.

అధిక ఖాతాలతో ఇబ్బందులు



కొందరికి రెండు, మూడు ఖాతాలు ఉండి వాటిలో ఏదో ఒక ఖాతా మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేటప్పుడు వినియోగంలో లేని ఖాతా నెంబర్ ఇవ్వడంతో సమస్యగా మారింది. ప్రతి లబ్ధిదారు ఖాతాను సద్వినియోగం చేసుకోవాలి. లేకపోతే మూసేసుకోవాలి. దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.

– చందాల శ్రీవెంకట ప్రసాద్, ఎల్‌డీఎం కాకినాడ జిల్లా

ప్రతి తపాలా కార్యాలయం ద్వారా ఐపీపీబీ ఖాతాలు



ప్రతి తపాలా కార్యాలయంలో ఐపీపీబీ ఖాతాలు ప్రారంభించి ఆధార్ అనుసంధానం చేస్తున్నాం. కాకినాడ డివిజన్‌లో ఉన్న కాకినాడ, సామర్లకోట ప్రధాన తపాలా కార్యాలయంతో పాటు 54 ఉప తపాలా కార్యాలయాలు, 283 శాఖలలో సేవలు సద్వినియోగం చేసుకోవాలి. – దాసరి నాగేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి పోస్టల్ సూపరిండెంట్, కాకినాడ

క్లుప్తంగా

ఈ-మ్యాగజైన్ ఆవిష్కరణ



ఈ-మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జయశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డైట్‌లో విద్యాగౌతమి మంత్లీ ఈ-మ్యాగజైన్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైట్‌లో జరిగిన కార్యక్రమాలు, ఛాత్రోపాధ్యాయుల కథలు, కవితలు, వ్యాసాలు, అధ్యాపకుల రచనలతో ఈ-మ్యాగజైన్‌ను నిరంతరంగా కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని డైట్‌లకు ఆన్‌లైన్‌లో ఫ్లిప్ బుక్ రూపంలో పంపిస్తామని తెలిపారు.

అడవుల సంరక్షణే ధ్యేయం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏపీసీసీఎఫ్ డాక్టర్ శాంతిప్రియా పాండే

రాజానగరం: అడవులు, వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని ఏపీసీసీఎఫ్ డాక్టర్ శాంతిప్రియా పాండే అన్నారు. దివాన్ చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీలో శిక్షణను పూర్తి చేసుకున్న 126వ బ్యాచ్ ఫారెస్టు బీట్ అధికారులకు బుధవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధంగా రాష్ట్రంలో శిక్షణ పొందాల్సిన ఉద్యోగులు 400 మంది వరకూ ఉన్నారన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎన్ మూర్తి, అకాడమీ డైరెక్టర్ బి.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్ విడుదల

రాయవరం: ఏపీ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రాథమిక పాఠశాల స్థాయి కాంప్లెక్స్, సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్, మార్గదర్శకాలు, అజెండా, సెషన్ వారీ అంశాలను వెల్లడించారు. ఉపాధ్యాయుల బోధనా తీరు మెరుగుదలకు, వారు బోధనలో ఎదుర్కొనే సవాళ్లు, వాటి పరిష్కారాల కోసం ఈ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తారు. గతంలో ఉమ్మడి జిల్లాలో 123 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా, ప్రస్తుతం వీటిని 87 క్లస్టర్ కాంప్లెక్స్‌లుగా మార్పు చేశారు. కాంప్లెక్స్ సమావేశాలను ప్రస్తుతం ఒక పూటకు కుదించారు. ఉదయం పాఠశాలను నిర్వహించిన అనంతరం ఉపాధ్యాయులు మధ్యాహ్నం స్కూల్ కాంప్లెక్స్‌లకు హాజరై సమావేశాలను నిర్వహించాలి. వీటి ద్వారా ఉపాధ్యాయులు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సి ఉంటుంది. జూలై 19, ఆగస్టు 23, సెప్టెంబర్ 20, అక్టోబర్ 18, నవంబర్ 22, డిసెంబర్ 20, జనవరి 24, ఫిబ్రవరి 21 తేదీల్లో ఎనిమిది కాంపెక్స్ సమావేశాలు జరుగుతాయి.

ఆగుతూ.. ఊగుతూ..

- దేవాలయాల శానిటరీ టెండర్ ఖరారు మరింత ఆలస్యం
- ప్రభుత్వానికే బాధ్యత అప్పగించిన వైనం
- ఏడాదికి రూ.60 కోట్లకు పెరగనున్న టెండర్
- పద్మావతి సంస్థకే దక్కినట్టు ఊహాగానాలు
- గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఆ సంస్థకే కాంట్రాక్టు



అన్నవరం దేవస్థానం ఆవరణలో భక్తుల రద్దీ



రత్నగిరిపై ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంతో కలిపి రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలకు శానిటరీ మెటీరియల్‌తో సహ క్లీనింగ్, హౌస్ కీపింగ్ తదితర పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు సెంట్రలైజ్డ్ ఈ ప్రొక్యూర్ రీ టెండర్ ఖరారు మరింత ఆలస్యం కానుంది. వాస్తవానికి ఈ నెల రెండో తేదీన ఈ టెండర్ ఖరారు కావాలి. అయితే వివిధ కారణాలతో ఆ టెండర్ ఖరారు బాధ్యతను దేవదాయ, ధర్మాదాయశాఖ ప్రభుత్వానికి అప్పగించినట్టు సమాచారం. అన్ని దేవస్థానాలకు కలిపి సుమారు రూ.60 కోట్లకు పైబడిన టెండర్ అవడంతో దేవదాయశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. ఈ నెలాఖరుకు లేదా ఆగస్టులో ఖరారు చేయనున్నట్లు సమాచారం.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏ దేవస్థానానికి ఆ దేవస్థానం తరఫున శానిటరీ టెండర్లు పిలిచి ఖరారు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రముఖ దేవస్థానాలకు ఒకే శానిటరీ టెండర్ పిలవాలని దాదాపు పది నెలలు ఆలస్యం చేశారు. ఏడు ప్రముఖ దేవస్థానాలను ఒకే యూనిట్‌గా శానిటరీ టెండర్లు నిర్వహించాలని గత ఏడాది ఆగస్టు 27న కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

టెండర్ ప్రక్రియ

తొలిసారిగా ఏప్రిల్‌లో టెండర్ పిలిచారు. అయితే ఆ నోటిఫికేషన్‌పై టెండరుదారులు అనేక సందేహాలు వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. మరికొన్ని మార్పులతో కొత్త నోటిఫికేషన్‌ను జూన్ 12న విడుదల చేసింది. టెండరుదారులు తమ కొటేషన్లు దాఖలు చేయడానికి ఆఖరు తేదీగా జూన్ 26ను నిర్ణయించారు. మొత్తం 23 మంది టెండర్ కోసం పోటీ పడినా, వివిధ కారణాలతో 21 మంది పక్కకు తప్పుకున్నారు. జూన్ 30న టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయగా విజయవాడకు చెందిన చైతన్యజ్యోతి శానిటరీ ఏజెన్సీస్, తిరుపతికి చెందిన పద్మావతి హౌస్ కీపింగ్, ఫెసిలిటీ సంస్థ క్వాలిఫై అయ్యాయి. దీంతో ఆ రెండు సంస్థల ప్రైస్ బిడ్ జూలై మూడో తేదీన ఓపెన్ చేసి తక్కువ కొటేషన్ దాఖలు చేసిన వారికి టెండర్ ఖరారు చేయాల్సి ఉంది.

సాంకేతిక కారణాలతో వాయిదా

సాంకేతిక కారణాలతో టెండర్ ఖరారును ప్రభుత్వానికి అప్పగించారు. ప్రభుత్వం వివిధ శాఖల అధికారులతో ఒక కమిటీని నియమించిందని, ఆ కమిటీ త్వరలో టెండరు దారును ప్రకటిస్తుందని అధికారులు తెలిపారు. అయితే ఈ టెండర్ పద్మావతి సంస్థకే దక్కినందున విమర్శలు రాకుండా ఉండేందుకే కాలయాపన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఏడు దేవస్థానాలలో శానిటరీ నిర్వహణ

టెండర్ దక్కించుకున్న సంస్థ రెండేళ్ల కాల పరిమితిలో అన్నవరం, సింహాచలం, శ్రీశైలం, ద్వారకాతిరుమల, విజయవాడ, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవస్థానాలలో పారిశుద్ధ్య పనులు, వివిధ సత్రాలలో హౌస్ కీపింగ్, రహదారులు, టాయిలెట్స్ క్లీనింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాల నిర్వహణ తదితర పనులు చేయాలి.

పెరగనున్న వ్యయం!

అన్నవరం దేవస్థానంలో పారిశుద్ధ్య సేవలకు కేఎల్‌టీసీ సంస్థకు నెలకు రూ.49 లక్షలు ఇచ్చేవారు. కనకదుర్గ ఏజెన్సీకి నెలకు రూ.59 లక్షలతో పాటు మరో రూ.12 లక్షలను మెటీరియల్‌కు కలిపి రూ.71 లక్షలు ఖర్చు చేస్తున్నారు. తాజాగా అన్ని దేవస్థానాలకు కలిపి పిలిచిన సెంట్రలైజ్డ్ టెండర్‌లో పారిశుద్ధ్య పనుల్లో అత్యాధునిక మెషినరీ ఉపయోగించాలనే షరతుతో బాటు ఏసీల నిర్వహణ, విద్యుత్ ఉపకరణాల నిర్వహణ కూడా కలిపారు. ఫలితంగా దేవస్థానంలో నెలకు శానిటరీ కాంట్రాక్టు రూ.80 లక్షలకు పైమాటే. అంటే ఏడాదికి సుమారు రూ.పది కోట్లను పారిశుద్ధ్యం కోసమే వెచ్చిస్తారు.

గత టీడీపీ ప్రభుత్వంలోనూ 'పద్మావతి'దే

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంటే 2014–19 మధ్య అన్నవరంతో పాటు పలు దేవస్థానాలలో శానిటరీ టెండర్‌ను పద్మావతి సంస్థ దక్కించుకుంది. మొదట రెండేళ్ల కాల పరిమితికి టెండర్ దక్కించుకున్న ఈ సంస్థకు ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం మరో రెండేళ్ల కాంట్రాక్టు పొడిగించింది. పద్మావతి సంస్థ యజమాని భాస్కర నాయుడు టీడీపీ పెద్దలకు సన్నిహితుడు కావడమే అందుకు కారణం. ఇప్పుడు మరలా ఆ సంస్థకే టెండర్ దక్కే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్ట్ ముగిసి ఆరు నెలలైనా...

అన్నవరం దేవస్థానంలో శానిటరీ పనులు నిర్వహించిన హైదరాబాద్‌కు చెందిన కేఎల్‌టీఎస్ సంస్థ కాంట్రాక్టు గత నవంబర్‌తో ముగిసింది. నిబంధనల ప్రకారం ఆ కాంట్రాక్టు ముగియడానికి ఒక నెల ముందుగానే ఈ శానిటరీ టెండర్ ప్రకటన (గత అక్టోబర్‌లో) విడుదల కావాలి. టెండర్లు పిలవడం ఆలస్యం కావడంతో, దేవస్థానం కోరిక మేరకు 2025 ఫిబ్రవరి నెలాఖరు వరకు ఆ సంస్థ సిబ్బంది విధులు నిర్వహించారు. అనంతరం మార్చి ఒకటిన దేవస్థానంలో శానిటరీ పనుల నిర్వహణకు ఎటువంటి టెండరు లేకుండానే గుంటూరుకు చెందిన కనకదుర్గ శానిటరీ సర్వీసెస్‌కు తాత్కాలికంగా అప్పగించారు. కానీ శానిటరీ మెటీరియల్‌ను మాత్రం దేవస్థానమే అందజేస్తోంది. జూలైతో కలిపి ఆ సంస్థ ఐదు నెలలుగా దేవస్థానంలో పారిశుధ్య కాంట్రాక్టు నిర్వహిస్తోంది. ప్రతి నెలా సిబ్బందికి జీతాలు ఆలస్యంగా ఇస్తుండడం వివాదస్పదమవుతోంది. జూలై నెలలో కూడా 15 తేదీ దాటినా ఇంకా పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వలేదు.

దేశ ప్రగతికి సాంకేతికతే వెన్నెముక

- సౌత్ ఏషియన్ వర్సిటీ ప్రెసిడెంట్ అగర్వాల్
- ఓక్ ఉత్సవాలు ప్రారంభం



ఓక్ వేడుకల్లో మాట్లాడుతున్న సౌత్ ఏషియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ అగర్వాల్

సాక్షిప్రతినిధి, కాకినాడ: దేశం ప్రగతి వైపు పయనించాలంటే సాంకేతిక వెన్నెముకగా ఉండాలని న్యూఢిల్లీ సౌత్ ఏషియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కేకే అగర్వాల్ అన్నారు. ప్రస్తుతం బీటెక్ విద్య ఏఐతో ముడిపడి నూతన పుంతలు తొక్కుతోందన్నారు. ఏ ఐఐటీలోనూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సు లేదన్నారు. కేవలం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కళాశాలలు మాత్రమే విద్యార్థులను ఎక్కువ చేర్చుకునేందుకు ఐటీ విభాగాన్ని ప్రారంభిస్తున్నాయన్నారు. కాకినాడలో 1946లో ఏర్పాటైన ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల 80వ వడిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఓక్ ఉత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. జేఎన్‌టీయూ కాకినాడ వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అగర్వాల్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులకు మెరుగైన పద్ధతులలో శిక్షణ నివ్వాలని పిలుపు నిచ్చారు. ఓక్ వేడుకలలో భాగంగా ఏడాది పాటు అంతర్జాతీయ కాన్ఫరెన్సులు, వర్క్‌షాప్‌లు, చర్చాగోష్టులు నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసి, క్యాలెండర్‌ను ప్రతినిధులు విడుదల చేశారు.

రాజకీయ జోక్యం ఉండకూడదు

గౌరవ అతిథి ప్రొఫెసర్ వేద్ ప్రకాశ్ మాట్లాడుతూ గత 50 ఏళ్లలో 47 యూనివర్సిటీను కొలమానంగా తీసుకోగా, వాటిలో మూడు విశ్వవిద్యాలయాలు మాత్రమే నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. ఉన్నత విద్యలో నూతన విధానాన్ని ప్రారంభించేందుకు విద్యార్థులకు అధిక సంఖ్యలో చేర్చుకోవాలన్నారు. రష్యా, చైనా దేశాల మాదిరిగా ప్రగతి సాధించాలంటే సైన్స్ బోధనలో ముందడుగు వేయాలన్నారు. విద్యలో రాజకీయవేత్తల జోక్యం ఉండకూడదన్నారు.

నైపుణ్యాల కొరత

ప్రొఫెసర్ డి.జానకిరామ్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా నూతన విద్యా విధానం 2020ను తీసుకువచ్చారన్నారు. దేశంలో ఇంజినీరింగ్ పట్టభద్రులు నైపుణ్యాల కొరతతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. దీన్ని సరిదిద్దడానికి విద్యావేత్తలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ ఎస్ఎంకే భట్నా మాట్లాడుతూ విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి కలిగేలా పాఠ్యాంశాలను రూపొందించాలన్నారు. జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఏఐఆర్‌ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విదేశీ విద్యార్థులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ నెల 17, 18 తేదీలలో 'రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020 స్వర్ణాంధ్ర వికసిత్ భారత్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, ఓక్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పి. ఉదయభాస్కర్, వైస్ ఛైర్మన్ ఎస్.శ్రీనివాస కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.పద్మరాజు పాల్గొన్నారు.

అన్నవరంలో శానిటరీ కాంట్రాక్టర్ మోసం

- రూ.30 లక్షల పీఎఫ్ చెల్లించినట్టు నకిలీ రశీదులు అందజేత
- వాటి ఆధారంగా రూ.1.77 కోట్ల బిల్లులు చెల్లించిన దేవస్థానం అధికారులు
- సిబ్బంది ఆందోళనతో వెలుగులోకి..



దేవస్థానానికి కాంట్రాక్టర్ అందించిన నకిలీ రశీదు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శానిటరీ కాంట్రాక్టర్ ఘరానా మోసం బయటపడింది. ఆలయంలో పారిశుద్ధ్య పనులు చేసే సిబ్బందికి ప్రావిడెంట్ ఫండ్ చెల్లిస్తున్నట్టు నకిలీ చలానాలు జమ చేసి, ఏకంగా రూ.1.77 కోట్ల బిల్లు రాయించుకున్నాడు. అయితే మూడు నెలలుగా తమ ఖాతాల్లో పీఎఫ్ జమకాక పోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది ఆందోళన చేశారు. దీంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అన్నవరం దేవస్థానంలో పారిశుద్ధ్య సిబ్బందిని సరఫరా చేసే కాంట్రాక్టును విజయవాడకు చెందిన కనకదుర్గ మేన్ పవర్ సర్వీసెస్ సంస్థ నిర్వహిస్తుంది. ఈ సంస్థ ప్రతి నెలా సుమారు 350 మంది సిబ్బందికి రూ.59 లక్షలను వేతనాలుగా చెల్లించాలి. ఈ మొత్తంలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ కింద 12 శాతం సిబ్బంది, 13 శాతాన్ని దేవస్థానం తరఫున కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉంటుంది. ముందుగా కాంట్రాక్టర్ పీఎఫ్ డబ్బులు కట్టేస్తే, అతడికి దేవస్థానం చెల్లిస్తుంది.


నకిలీ రశీదులు

దేవస్థానం నుంచి సిబ్బంది పీఎఫ్ వాటా సొమ్ముల కోసం కాంట్రాక్టర్ మోసానికి తెర తీశాడు. ఆ డబ్బులు చెల్లించినట్టు నకిలీ రశీదులు సృష్టించాడు. వాటిని దేవస్థానానికి జమ చేశాడు. నిబంధనల ప్రకారం.. అతడు డబ్బులు కట్టిన తర్వాతే, దేవస్థానం తిరిగి చెల్లిస్తుంది. మార్చిలో రూ.10.09 లక్షలు, ఏప్రిల్‌లో రూ.10.64 లక్షలు, మేలో 10.45 లక్షలు చెల్లించినట్టు నకిలీ రశీదులు జమ చేశాడు. దీంతో దేవస్థానం ఆ మొత్తాలను కలిపి ఆ మూడు నెలలూ నెలకు రూ.59 లక్షలను పారిశుద్ధ్య సిబ్బంది జీతాలుగా చెల్లించింది. వాస్తవానికి దేవస్థానం అధికారులు, ఆడిట్ అధికారులు ఈ చెల్లింపులు కరెక్టేనా అని తనిఖీ చేయాలి. కానీ అవేమీ లేకుండా బిల్లు చెల్లించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మోసం బయటపడిందిలా..

పారిశుద్ధ్య సిబ్బందికి ప్రతి నెలా జీతం పడుతున్నప్పటికీ పీఎఫ్ అకౌంట్‌కు జమ కావడం లేదు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది ఆందోళన చేశారు. దీనిపై కాంట్రాక్టర్‌ను దేవస్థానం అధికారులు వివరణ అడగడంతో అతను పొంతన లేని సమాధానాలు చెప్పాడు. అతనిచ్చిన రశీదులను స్కాన్ చేస్తే అవి నకిలీవని తేలింది. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి కేసు పెడతామని హెచ్చరించడంతో అతను మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి జూలై 9, 14, 15 తేదీలలో రూ.10.09 లక్షలు, రూ.9.90 లక్షలు, రూ.9.75 లక్షలు చెల్లించి ఆ రశీదులను మంగళవారం జమ చేశాడు. కాగా.. కాంట్రాక్టర్ ముందుగా ఇచ్చిన రశీదులపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ మూడు బిల్లులు డిసెంబర్‌లో కట్టినవిగా తేలింది. వాటిపై నంబర్లు, తేదీని ఫోర్జరీ చేసి దేవస్థానంలో పీఎఫ్‌కి చెల్లించినట్టుగా మార్చారు. అంతే కాకుండా కట్టిన మొత్తం కూడా ఒక్కోటి రూ.5 లక్షలు చొప్పున ఉన్నాయి.

కాంట్రాక్టర్‌ను సంజాయిషీ కోరాం



శానిటరీ టెండర్ దారుడు పీఎఫ్ చెల్లించనట్టుగా నకిలీ చలానాలు జమ చేసినట్టుగా మా దృష్టికి వచ్చింది. దానిపై విచారణ చేయాలని సంబంధిత సెక్షన్ అధికారులను ఆదేశించాం. కాంట్రాక్టర్ తప్పు చేసినట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

శతాధిక వృద్ధుడి మృతి



కొర్లపాటి వెంకట్రావు (ఫైల్)

గోపాలపురం: వేళ్ల చింతలగూడెం గ్రామానికి చెందిన కొర్లపాటి వెంకట్రావు (101) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు వేళ్ల చింతలగూడెం సర్పంచ్‌గా పనిచేశారు. కాగా.. వెంకట్రావు మృతదేహాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు.

మోటారు సైకిల్ ఢీకొని..



రామకృష్ణ (ఫైల్)

గండేపల్లి: జాతీయ రహదారిపై మల్లేపల్లి వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొర్రంపాలేనికి చెందిన శీలం రామకృష్ణ (64), అప్పారావు మోటారు సైకిల్‌పై తాగునీటి కోసం మల్లేపల్లి వస్తున్నారు. ఆ గ్రామంలో సంత మార్కెట్ సమీపంలోకి వచ్చేసరికి వెనక వస్తున్న మరో మోటారు సైకిల్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మోటారు సైకిల్‌పై వస్తున్న వారికి గాయాలు కావడంతో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు..

అంబాజీపేట: కొబ్బరి బొండాలు విక్రయించే వ్యక్తి పాము కాటుకు గురై మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఇరుసుమండకు చెందిన తోట శ్రీనివాసరావు (58) ముక్కామల గ్రామంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తుంటాడు. రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి వ్యాపారం ముగిసిన తర్వాత ఖాళీ కొబ్బరి బొండాలను దూరంగా పారబోయడానికి ఒబ్బిడి చేస్తున్నాడు. ఆ సమయంలో ఖాళీ కొబ్బరి బొండాల్లో ఉన్న రక్త పింజరి కాటు వేయడంతో మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రైతుపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

నల్లజర్ల: పోతవరం గ్రామానికి చెందిన రైతు కానూరి జనార్దనరావుపై మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ సంఘటనలో ఆయన కాలుకు తీవ్ర గాయం కావడంతో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జనార్దనరావుకు జంగారెడ్డిగూడేనికి చెందిన కొందరితో భూవివాదాలు ఉన్నాయి. ఆ విషయంపై మంగళవారం తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరై అనంతరం పోతవరంలో తన ఇంటికి వచ్చేశాడు. ఆ సమయంలో సుమారు 8 మంది తనపై దాడి చేశారని, కోర్టు కేసు ఉపసంహరించుకోకుంటే చంపేస్తామంటూ బెదిరించారని, కర్రలతో తీవ్రంగా కొట్టారని రైతు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై నల్లజర్ల పోలీసులను వివరణ కోరగా.. ఆసుపత్రి నుంచి ఎంఎల్‌సీ రిపోర్టు అందాల్సి ఉందన్నారు.


ట్రాక్టర్ డ్రైవర్ మృతి



పెనుమత్స హరీష్

రాజానగరం: జాతీయ రహదారిపై గైట్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. అతడిని రావులపాలెం మండలం ఈతకోటకు చెందిన పెనుమత్స హరీష్ (32)గా గుర్తించారు. రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరీష్ తన ట్రాక్టరులో ఎరువుల లోడు చేసుకుని శంఖవరం వెళుతుండగా గైట్ కళాశాల వద్ద ప్రమాదానికి గురయ్యాడు. రహదారి నుంచి కళాశాల ప్రాంగణంలోకి వెళుతున్న కళాశాల బస్సును ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొనడంతో డివైడర్‌పై నుంచి దూసుకుపోయింది. ఈ క్రమంలో కింద పడిన హరీష్‌పై నుంచి ట్రాక్టరు చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావ ఇసుకపల్లి శివరామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



కొత్తపల్లి ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గోకవరం: కొత్తపల్లి గ్రామంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ డీఎస్పీ మురళీకృష్ణ, రంపచోడవరం సహాయ వ్యవసాయ సంచాలకుడు వి.రవీంద్రనాథ్ తదితరులు ఆయా షాపుల్లో రికార్డులను పరిశీలించారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు తెలిపారు. కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజశ్వరి, సిబ్బంది రమేష్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కరప: తన తల్లి, భార్యకు మధ్య జరుగుతున్న గొడవలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరప మండలం గురజనాపల్లిలో ఈ విషాద ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గురజనాపల్లికి చెందిన చోడిశెట్టి మణికంఠ (34) తాపీ పనిచేస్తుంటాడు. అతడికి రెండేళ్ల క్రితం కీర్తనతో వివాహమైంది. ఆ దంపతులకు చిన్నపాప ఉంది. చక్కగా సాగుతున్న ఆ కుటుంబంలో అత్త, కోడలు (మణికంఠ తల్లి, భార్య) మధ్య ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. వీటితో మణికంఠకు మనశ్శాంతి కరువైంది. తల్లికి, భార్యకు సర్దిచెప్పలేక, మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన మణికంఠ మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి బయటకు వెళ్లిపోయి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృత్యువుతో పోరాడుతూ స్నేహితుడికి ఫోన్ చేసి గడ్డి మందు తాగిన విషయాన్ని చెప్పాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కరప ఇన్‌చార్జి ఎస్ఐ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రాధాన్యం

- జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్
- ఉత్సాహంగా మీట్‌గ్రీట్ విత్ వైస్ చాన్సలర్ కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ అన్నారు. వర్సిటీ ఆడిటోరియంలో బుధవారం అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సెక్రటరీలు, కరస్పాండెంట్లతో మీట్ గ్రీట్ విత్ వైస్ చాన్సలర్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యతా ప్రమాణాలను పెంచడానికి చేపట్టిన వినూత్న ఇన్నోయేటివ్స్‌ను వివరించారు. సిలబస్, రెగ్యులేషన్స్ నవీకరణ, పరిశోధనలకు పెద్దపీట వేయడం, విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి విద్యా సంవత్సరం అకడమిక్ ఆడిట్ నిర్వహించాలని, స్టూడెంట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగాలన్నారు. యూనివర్సిటీలో ఓపెన్ లెర్నింగ్, ఓడీఎల్ కోర్సులు, మూక్స్ విద్యా విధానాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. విదేశీ యూనివర్సిటీలతో ఎంఓయూ ద్వారా బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీలో జరుగుతున్న పరిశోధనలు, నూతన సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, ఓఎస్‌డీ ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు, అఫిలియేషన్స్, లీగల్ మ్యాటర్స్ డైరెక్టర్ ఎ.బాలాజీ, డైరెక్టర్ అకడమిక్స్ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం.కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంకు తీవ్ర అస్వస్థత

మలికిపురం: మలికిపురం మండల వెలుగు ఏపీఎం అజయ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయనను డీఆర్‌డీఏ జిల్లా పీడీ జయచంద్ర గాంధీ బుధవారం పరామర్శించారు. మలికిపురంలో మండల సమాఖ్య నిధులకు సంబంధించిన కీలక ఫైళ్లను ఆరా తీసిన అంశంలో కార్యాలయ ఉద్యోగితో తలెత్తిన విభేదాల కారణంగా అజయ్ తీవ్ర ఒత్తిడికి గురయ్యారని సమాచారం. ఇటీవల కార్యాలయంలో ఆడిట్ పూర్తయ్యింది. అయితే నిధులేమైనా గల్లంతయ్యాయా అనే విషయంలో స్పష్టత లేదు. మలికిపురం వెలుగు కార్యాలయ ఉద్యోగితో పాటు ముమ్మిడివరంలోని డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయంలో ఒక కీలక ఉద్యోగికి కూడా అజయ్ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్నారు. కాగా.. అజయ్ ఆస్పత్రిలో ఉండడంతో మలికిపురం ఏపీఎంగా సయీద్‌ను నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.